
బోథ్‌లో దుర్గామాతను మండపానికి తరలిస్తూ..


జిల్లా కేంద్రంలోని బొజ్జవార్ ఆలయంలో కొలువుదీరిన దుర్గాదేవి విగ్రహం


ప్రత్యేక వాహనంలో ప్రతిమను తీసుకెళ్తున్న భక్తులు

దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో దుర్గమ్మ విగ్రహాలు కొలువుదీరాయి. ఆయా మండపాల్లో నిర్వాహకులు దుర్గాదేవి ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం, బోథ్

4 రోజులు చుట్టేద్దాం.. నచ్చిన చోటు చూసేద్దాం!

● ఉమ్మడి జిల్లాపై అవగాహన పెంచుకునేందుకు మంచి తరుణం

దండేపల్లి, న్యూస్‌టుడే

మూడు నెలల పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులకు దసరా సెలవులొచ్చాయి. సెలవులంటే చాలు అందరికీ సంబరమే. కొత్త ప్రదేశాల్లో ఆనందంగా గడుపుతూనే మరో వైపు మనకు దగ్గరలోని చారిత్రాత్మక ప్రాంతాలు, దేవాలయాలను ఓసారి చుట్టి వస్తే అనుభవాలు, జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయి. ఓ నాలుగు రోజుల్లో పిల్లలు చూసే ఎన్నో విశేషాలు.. వివిధ ప్రదేశాలతో ఆయా ప్రాంతాలపై అవగాహన పెంచుకోవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని కొత్త జిల్లాల వారీగా ఇక్కడి ప్రాంతాల విశిష్టతను తెలుసుకునే అవకాశముంది.

నిర్మల్ జిల్లాలో...



నిర్మల్ ఖ్యాతిని తెలిపే కొయ్యబొమ్మలు

నిర్మల్ జిల్లా కేంద్రంలో తయారయ్యే కొయ్యబొమ్మలు చూడాల్సిందే. తెలికపాటి పొనికి కర్రతో 400 ఏళ్ల నుంచి తయారు చేస్తున్న ఈ బొమ్మలు సజీవంగా మన కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి.


◆ ఇక్కడి నుంచి 15 కి.మీ. దూరంలోని నిజామాబాద్ జిల్లాలో ఉన్న శ్రీరాంసాగర్ జలాశయాన్ని చూసిరావచ్చు..

కడెం.. అందాల కనువిందు



కడెం మండల కేంద్రంలో వాగుపై నిర్మించిన జలాశయం నిర్మల్ జిల్లాలోని కడెం, దస్తూరాబాద్‌తో పాటు మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలకు సాగు నీరందిస్తున్న తీరును, విశేషాలు తెలుసుకోవచ్చు. బోటు ద్వారా జలాశయం అందాలను తిలకించవచ్చు.

బాసర సరస్వతి క్షేత్రం..





చదువుల తల్లి సరస్వతి అమ్మవారు ముథోల్ మండలంలోని బాసరలో కొలువై ఉంది.. గోదావరి నదీ తీరంలో ఉన్న దేవాలయాన్ని దర్శించుకోవడంతో పాటు, అక్షరాభ్యాసం చేయించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వస్తుంటారు.

◆ నిర్మల్ నుంచి బాసర వెళ్లే మార్గంలో కదిలి దేవాలయాన్ని దర్శించుకోవచ్చు..

ఆదిలాబాద్ జిల్లాలో

1200 ఏళ్ల నాటి సూర్యదేవాలయం



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవస్థానాన్ని 122 ఏళ్ల కిందట జైనులు నిర్మించారు. ఏటా రెండు సార్లు సూర్యకిరణాలు స్వామి వారి పాదాలను స్పృశిస్తుండటం దీని ప్రత్యేకత. ఆదిలాబాద్ నుంచి 30 కి.మీ. దూరంలో ఉంటుంది.

పర్యాటకుల సందడి.. కుంటాల జలపాతం..



ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కుంటాల జలపాతాన్ని చూడడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది నిత్యం వస్తుంటారు. చుట్టూ దట్టమైన అడవిలో ఉన్నందున అటవీమార్గం గుండా జలపాతానికి చేరుకోవడం ఓ అనుభూతి. కుంటాల నుంచి 12 కి.మీ. ఉంది.

అనుభూతిని పంచే పొచ్చెర..



ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర సమీపంలో ఉన్న జలపాతం పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తోంది. ఎత్తైన ప్రదేశం నుంచి నీరు కిందికి జాలువారుతాయి. దీన్ని వీక్షించడం గొప్ప అనుభూతిగా చెప్పుకోవచ్చు. బోథ్ జాతీయ రహదారి ఎక్స్ రోడ్ నుంచి ఆరు కి.మీ. దూరంలో ఉంది.




కుమురంభీం జిల్లాలో...

కుమురంభీం స్మారక మ్యూజియం

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం జోడేఘాట్ వద్ద నిర్మించిన కుమురంభీం స్మారక మ్యూజియం ఎంతో ప్రసిద్ధమైంది. జల్, జంగల్, జమీన్ నినాదంతో నిజాంలతో పోరాడి జీవితాన్నే త్యాగం చేసిన కుమురంభీం జీవిత విశేషాలను తెలిపే మ్యూజియం ఇది. దీనికి దగ్గరలో ఉన్న కెరమెరి ఘాట్ రహదారి కూడా వీక్షించవచ్చు.



మంచిర్యాల జిల్లాలో...

సింగరేణి.. సిరుల వేణి




మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి 10 కి.మీ. నుంచి 30కిలోమీటర్ల దూరంలోనే శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, ఇందారం, మందమర్రి, బెల్లంపల్లి గనులున్నాయి.. ఇందులో భూగర్భ గనులతో పాటు ఉపరితల గనులున్నాయి. బొగ్గు తీయడం దగ్గర నుంచి రవాణా చేసే వరకు వివిధ దశలు, కార్మికుల శ్రమను తెలుసుకోవచ్చు..

ఎల్లంపల్లి జలాశయం..



గోదావరి నదిపై హాజీపూర్ మండలం ఎల్లంపల్లి సమీపంలో నిర్మించిన జలాశయాన్ని చూడొచ్చు. ఇది మంచిర్యాల, లక్షెట్టిపేట మధ్యలో ఉంటుంది. సాగు నీటితో పాటు హైదరాబాద్ వరకు తాగు నీరందించే ప్రక్రియను వీక్షించవచ్చు.

సత్యదేవుని నిలయం..గూడెం



తెలంగాణలో ఉన్న ఏకైక సత్యదేవుని ఆలయం దండేపల్లి మండలం గూడెం సమీపంలో గోదావరి తీరంలో ఉంది. జాతీయ రహదారిని ఆనుకుని నిర్మించిన ఈదేవాలయం పక్కనే అయ్యప్ప ఆలయం, సాయిబాబా ఆలయాలు ఉన్నాయి... గోదావరి తీరంలో ఎల్లంపల్లి నుంచి నీరందించే గూడెం ఎత్తిపోతల పథకం ఉంది..

◆ ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద రెండో చర్చిగా ప్రసిద్ధి చెందిన సీఎస్ఐ చర్చి లక్షెట్టిపేటలోని ఉంది..

◆ మంచిర్యాల జిల్లాలోని జన్నారం నుంచి ఆదిలాబాద్ జిల్లా వరకు విస్తరించి ఉన్న కవ్వాల్ అభయారణ్యాన్ని తిలకించవచ్చు. జన్నారం మండల కేంద్రంలోని జింకల సంరక్షణ కేంద్రం, మ్యూజియంను సందర్శించవచ్చు. ఇక్కడ నుంచి సఫారీ వాహనంలో లోపల ఉన్న అడవిని చుట్టి రావచ్చు.



రైల్వే పట్టాలపై కనిపించని శుభ్రత

ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లోని రైలు పట్టాల వెంబడి అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. ప్లాట్‌ఫాంలు, రైల్వే ట్రాక్‌లను శుభ్రం చేయడానికి రైల్వే శాఖ ఏటా రూ.22 లక్షలు వ్యయం చేస్తోంది. అప్పుడప్పుడు ఒకరిద్దరు మహిళలతో నామమాత్రంగా పారిశుద్ధ్య పనులు చేయిస్తూ మమ అనిపిస్తోంది. ఆదిలాబాద్ స్టేషన్‌లోని పట్టాలపై పాలిథీన్ కవర్లు కనిపిస్తున్నాయి. ఈ కవర్లు గాలికి ఎగిరి విద్యుత్తు తీగలకు చుట్టుకోవటంతో గతంలో రెండు గంటల పాటు రైలు నిలిచిపోయింది.

- ఈనాడు, ఆదిలాబాద్, - న్యూస్‌టుడే, ఎదులాపురం

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

ఉట్నూరు గ్రామీణం: రాష్ట్రంలో ఐటీడీఏ పరిధిలో జీవనం సాగిస్తున్న గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఆసుపత్రులను బలోపేతం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ, ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు.

పంటల సర్వే చేయలేం!

● చేతులెత్తేసిన వ్యవసాయ విస్తరణ అధికారులు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

రాష్ట్రం మొత్తంలో ఇప్పటి వరకు నిర్వహిస్తున్న పంటల సమగ్ర సర్వే స్థానంలో డిజిటల్ సర్వే చేపట్టాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. సర్వేకు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. డిజిటల్ సర్వే వల్ల పనిభారం పెరుగుతుందని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ఇక్కడ అమలు చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులు సర్వే చేసేందుకు నిరాకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇప్పటికే సర్వే ప్రారంభించాల్సి ఉండగా, పని ఒత్తిడి, విస్తీర్ణం ఎక్కువగా ఉండటం, సిబ్బంది కొరత వంటి కారణాలతో ఏఈఓలు సర్వేకు దూరంగా ఉన్నారు.

రైతులు ఏయే పంటలు, ఎన్ని ఎకరాల్లో సాగు చేశారనే దానిపై ఏటా వ్యవసాయశాఖ సీజన్ల వారీగా పంటల నమోదును నిర్వహిస్తోంది. సమాచార సేకరణలో లోటుపాట్లు ఉండటం, రైతులకు ఇబ్బందులు ఏర్పడటంతో వ్యవసాయ రంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ)ని రూపొందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం డిజిటల్ అగ్రి మిషన్ పథకాన్ని తీసుకొచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు నేరుగా రైతులకు అందేలా, వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచటానికి ఆధునిక సాంకేతికతను వినియోగించనుంది.



పంట కొనుగోళ్లలో ఇబ్బందులతో..

నాలుగు సంవత్సరాల నుంచి రైతుల వారీగా పంటల నమోదును(క్రాప్ బుకింగ్) మండల వ్యవసాయ విస్తరణ అధికారులు చేస్తున్నారు. చాలా మంది పంట పొలాలకు వెళ్లకుండా రైతులను అడిగి రాసుకోవడంతో పంట ఉత్పత్తులను విక్రయించే సమయంలో ఇబ్బందులు ఏర్పడటంతో పంటల నమోదు ప్రక్రియను పక్కాగా జరిపించేందుకు శాటిలైట్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. గత సీజన్‌లో ఆదిలాబాద్ జిల్లాలో మావల, నిర్మల్ జిల్లాలో లోకేశ్వరం మండలాల్లో ప్రయోగాత్మకంగా డిజిటల్ సర్వేను పూర్తి చేశారు. ఈ సీజన్ నుంచి ఉమ్మడి జిల్లా మొత్తంలో డిజిటల్ సర్వేను చేపట్టాలని ఆదేశాలు అందాయి.

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

- శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయాధికారి

ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటల్ సర్వేను ప్రారంభించాం. సర్వే చేయడంలో ఇబ్బందులు ఉన్నాయని వ్యవసాయ విస్తరణ అధికారులు సర్వే చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

జిల్లాల వారీగా సాగు విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో), రైతులు(లక్షల్లో) ■ జిల్లా ■ క్లస్టర్లు ■ రైతులు ■ విస్తీర్ణం



జిల్లా	ఆదిలాబాద్	నిర్మల్	మంచిర్యాల	కుమురంభీం
క్లస్టర్లు	102	79	56	70
రైతులు	1.47	1.75	1.43	1.14
విస్తీర్ణం	5.72	4.23	3.39	4.23

పని ఒత్తిడి పెంచుతున్నారు..

- గంగారెడ్డి, అధ్యక్షుడు, వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం

ఇతర రాష్ట్రాలకు ఇక్కడికి భిన్నంగా ఉంది. ప్రస్తుతం కుటుంబ నిర్ధారణ చేస్తూనే, వ్యవసాయశాఖ పరిధిలోని 49 రకాల పనులు చేస్తున్నాం. సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు డిజిటల్ సర్వేను చేయడం లేదు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : డిజిటల్ కార్డుల జారీ కోసం ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలం లోహరలో గురువారం ప్రారంభమైన డిజిటల్ కార్డుల ప్రయోగాత్మక సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేను ప్రత్యక్షంగా పరిశీలించి ఇంటి యజమానిగా సీనియర్ మహిళ పేరు ఉండాలని, తర్వాత కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. అనంతరం చరవాణిలో వారి ఫొటో తీసుకోవాలని తెలిపారు. వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. గ్రామంలో తాగు నీటి, అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవన సమస్యను గ్రామస్థులు తెలపగా.. స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆర్డీవో వినోద్‌కుమార్, ఎంపీడీవో నాగేశ్వర్, ఉప తహసీల్దార్ సాయిమహేశ్, ఎంపీవో సత్యానంద్, పంచాయతీ కార్యదర్శులు రాహుల్, అనిల్, కార్యాలయ సిబ్బంది గజానంద్‌లు ఉన్నారు.

రెండు బృందాలుగా...

లోహరలో ప్రయోగాత్మక డిజిటల్ కార్డు సర్వేను రెండు బృందాలుగా చేపట్టారు. ఎంపీడీవో, తహసీల్దార్ ఆధ్వర్యంలో రెండు బృందాలు లోహర, సలాయిగూడలో గురువారం ప్రారంభించారు. లోహర పంచాయతీలో మొత్తం 189 కుటుంబాలు ఉన్నాయి. 670 జనాభా ఉంది. మొదటి రోజు లోహరలో 50, సలాయిగూడలో 32 కుటుంబాల సర్వేను అధికారులు పూర్తి చేశారు.

బతుకమ్మ నిమజ్జనం దూరాభారం



టైలర్స్ కాలనీ, సంజయ్‌నగర్, భుక్తాపూర్, ఫిల్టర్‌బెడ్, పోలీస్ కాలనీ, ఆదర్శనగర్ నుంచి వేలాది మంది మహిళలు బట్టిసావర్గాం వైపు వెళ్లే మార్గంలో గ్రీన్ సిటీ కాలనీ వంతెన వద్దకు వచ్చి బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. ఇక్కడ బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి మూడేళ్ల కిందట రూ.20లక్షలు వెచ్చించారు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు.



బాలాజీనగర్ కాలనీలోని చెరువు ఇది. ఇక్కడ కేఆర్కే కాలనీ, కైలాస్‌నగర్, పిట్టలవాడ, కొత్త కుమ్మరివాడ, వాల్మీకినగర్, శాంతినగర్, పాతహౌజింగ్‌బోర్డు కాలనీల మహిళలు బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. ఇక్కడ ఘాట్ లేక ఏటా ఇబ్బందులు పడుతున్నారు.



● ఖానాపూర్ చుట్టుపక్కల మినహా ఇతర చోట్ల ఇబ్బందులు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే పండగ బతుకమ్మ. ఆదిలాబాద్‌లో 15 రోజుల పాటు చిన్నారులు, యువతులు ఆనందోత్సాహాలతో ఆడిపాడతారు. అనంతరం కాలనీలకు సమీపంలోని వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. ఆదిలాబాద్ పట్టణంలో ఖానాపూర్ చెరువు వద్దనే నిమజ్జన ఘాట్లున్నాయి. సమీప కాలనీల వాళ్లు అక్కడ నిమజ్జనం చేస్తారు. మిగతా వారు దూరాభారంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 49 వార్డులు, వందకు పైగా కాలనీలున్న పట్టణంలో చాలాచోట్ల చెరువులు, వాగులున్నాయి. అధికారులు ఖానాపూర్ చెరువు దగ్గర తప్పితే మరెక్కడా ఘాట్లను నిర్మించలేదు. బల్దియా యంత్రాంగం బతుకమ్మలు నిమజ్జనం చేసే వాగు సమీపంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసి సరిపెడుతున్నారు. ఖానాపూర్ చెరువు తరహాలో ఇతరచోట్ల ఘాట్లు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

వాహనాల్లో తీసుకెళ్లాల్సిందే

విలీన కాలనీలు అయిన 170 కాలనీ, కొత్తహౌజింగ్‌బోర్డు కాలనీ, రాంనగర్, భగవతీనగర్ వాళ్లు కొందరు వాహనాల్లో మావల చెరువులో నిమజ్జనానికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. మరికొందరు కోజా కాలనీకి వెళ్లే వంతెన వద్దకు వెళ్తారు. మహాలక్ష్మివాడ, చిల్కూరి లక్ష్మీనగర్ వాసులు చాందా వాగు వైపు కొందరు, ఖానాపూర్ చెరువు వైపు కొందరు వెళ్తారు. తాటిగూడ, భాగ్యనగర్, హమాలీవాడ వాసులకు భీంసరి వాగు సమీపంలోనే ఉన్నా అక్కడ సదుపాయాలు లేక కొందరు చాందా వాగు వైపు, మరికొందరు రణదివెనగర్ వంతెన వద్దకు వాహనాల్లో వెళ్తారు. కేఆర్కే కాలనీ, కైలాస్‌నగర్, పిట్టలవాడ, కొత్త కుమ్మరివాడ, వాల్మీకినగర్, శాంతినగర్, పాతహౌజింగ్‌బోర్డు వాసులకు బాలాజీనగర్ చెరువు అనుకూలంగా ఉన్నా అక్కడ శాశ్వత ఏర్పాట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.

రూ. 50 లక్షలు వెచ్చిస్తే పరిష్కారం

పట్టణంలో బతుకమ్మల నిమజ్జన ఘాట్ల నిర్మాణానికి అవసరమైన వాగులు, చెరువులున్నాయి. దుర్గానగర్ వైపు నుంచి వచ్చే వాగు పిట్టలవాడ, దస్నాపూర్, రాంనగర్, సాయినగర్, టీచర్స్ కాలనీ, సుభాష్‌నగర్, టైలర్స్‌కాలనీ, రణదివెనగర్, గాంధీనగర్ మీదుగా భీంసరి నుంచి వచ్చే వాగులో కలిసి చాందా వైపు పయనిస్తుంది. ఈ వాగుపై రూ.50 లక్షలు వెచ్చించి కనీసం మూడుచోట్ల ఘాట్లు నిర్మించినా సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమవుతుంది. టైలర్స్ కాలనీ నుంచి బట్టిసావర్గాం వైపు వెళ్లేదారిలో గ్రీన్‌సిటీ వంతెన వద్ద రూ.20 లక్షలతో నిర్మించ తలపెట్టిన బతుకమ్మ ఘాట్ ఇప్పటికీ అతీగతీ లేదు.



ఖానాపూర్ చెరువు వద్ద మూడుచోట్ల బతుకమ్మ ఘాట్లను నిర్మించారు. సమీప కాలనీల్లోని మహిళలే ఇక్కడ నిమజ్జనం చేస్తారు. మిగతా ప్రాంతాల మహిళలకు ఇది దూరాభారం కావడంతో ఇక్కడకు రాలేని పరిస్థితి ఉంది. పట్టణంలో వాగులు, చెరువులు చాలా చోట్ల ఉన్నా ఘాట్లను నిర్మించలేదు.

ఏర్పాట్లు చేస్తున్నాం - తిరుపతి, డీఈఈ, బల్దియా

బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా మహిళలకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నాం. ఎక్కడెక్కడ నిమజ్జనాలు జరుగుతాయో అక్కడ స్టోన్‌డస్ట్, ర్యాంపు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. వీధి దీపాలను అమర్చుతున్నాం. గ్రీన్‌సిటీ కాలనీ వంతెన వద్ద రూ.20 లక్షలతో బతుకమ్మ ఘాట్ నిర్మించేందుకు టెండరు అయినా గుత్తేదారు పనులు చేపట్టలేదు.

రాంలీలా మైదానం పరిశీలన

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : దసరా పండగ కోసం సనాతన హిందూ ఉత్సవ సమితి నాయకుల ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్ గురువారం జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానాన్ని పరిశీలించారు. వారితో కలిసి భూమిపూజ చేశారు. కౌన్సిలర్ వెనగంటి ప్రకాశ్, సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రమోద్‌కుమార్ ఖత్రి, గౌరవ అధ్యక్షుడు బండారి వామన్, కోశాధికారి సూర్యకాంత్, సభ్యులు రవీందర్, నర్సిములు, సంతోశ్, లచ్చు, శ్రీను, మహిపాల్, స్వామి, అజయ్ తదితరులు ఉన్నారు.

'పీఎం యశస్వి'కి దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం యశస్వి పథకం కింద ఉపకార వేతనాలకు బీసీ, ఈబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజలింగు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పథకానికి ఎంపికైన 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.75 వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.1.25 లక్షల చొప్పున ఉపకార వేతనం అందిస్తారన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షలకు మించరాదన్నారు. 31లోగా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

టోకెన్ల కోసం వెంపర్లాట

ఆదిలాబాద్ డైట్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన కోసం గురువారం భారీగా అభ్యర్థులు తరలివచ్చి కొంతెక్క వద్ద గుమిగూడారు. ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఆ సమయంలో పాలనాధికారి రాజర్షిషాలోనికి వెళ్లేందుకు కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఇది గమనించిన డీఈవో ప్రణీత అభ్యర్థులకు టోకెన్లు ఇవ్వాలని సిబ్బందిని పురమాయించారు. ఆ టోకెన్ల కోసం అభ్యర్థులు పరుగులు పెట్టి పోటీ పడాల్సి వచ్చింది.



- ఈనాడు - ఆదిలాబాద్, - న్యూస్‌టుడే- పాలనాప్రాంగణం

పచ్చందాల దారిలో.. ప్రకృతిని ఆస్వాదించేలా

సింగరేణి బొగ్గు గనులు, విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు విస్తరించి ఉన్న శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలోని ప్రధాన రహదారికి ఇరువైపులా పచ్చదనం పెద్దగా కనిపించదు. కానీ మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామం వద్ద రహదారికి ఇరువైపులా పచ్చదనంతో కనువిందు చేస్తూ ఆహ్లాదం పంచుతోంది. శ్రీరాంపూర్ నుంచి ఆసిఫాబాద్ వరకు 363 జాతీయ రహదారి నిర్మించారు. మార్గమధ్యలోని బొక్కలగుట్ట వద్ద సుమారు 340 ఎకరాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో గాంధారి వనాన్ని అద్భుతంగా విస్తరింపజేశారు. ప్రస్తుతం ఆరు కిలోమీటర్ల విస్తీర్ణంలో అన్ని రకాల వేలాది చెట్లు కనువిందు చేస్తున్నాయి. అప్పటి వరకు పచ్చదనం కనిపించని రోడ్లపై ప్రయాణికులు ఒక్కసారిగా ప్రకృతి ఒడిలో నుంచి ప్రయాణిస్తుండటంతో సుమారు కిలోమీటర్ల మేర ప్రత్యేక అనుభూతి పొందుతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి నిత్యం వందలాది మంది వ్యాయామం, యోగా, ధ్యానం చేసేందుకు వస్తుంటారు. ఇక్కడ గాంధారి మైసమ్మ ఆలయం ఉండటంతో నిత్యం భక్తులు వంటా వార్పు చేసుకుంటూ ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. పక్కనే ఉన్న గాంధారిఖిల్లా గుట్టలు కనువిందు చేస్తున్నాయి. - న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం



జాతీయ రహదారికి ఇరువైపులా గాంధారి వనం



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, చిత్రంలో నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలి

నిర్మల్, న్యూస్‌టుడే : ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి పాటుపడాలని రాష్ట్ర షెడ్యూల్డు కులాలు, తెగల కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. వివిధ శాఖల ద్వారా వీరికి అందుతున్న పథకాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీల కోసం మంజూరైన, వినియోగించిన నిధులకు సంబంధించి వివరాలను శాఖల వారీగా అధికారులు వివరించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్ మరమ్మతులకు అవసరమయ్యే నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల విద్యలో ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేసినందుకు కలెక్టర్, విద్యాశాఖ అధికారులను అభినందించారు. జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం కమిషన్ ఛైర్మన్, సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేసిన డీఈవో రవీందర్‌రెడ్డిని కమిషన్ ఛైర్మన్, సభ్యులు సన్మానించారు. ఎస్పీ జానకి షర్మిల, అదనపు పాలనాధికారులు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

చిరునవ్వు నవ్వేద్దాం.. ఆరోగ్యంగా ఉందాం!

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం : చిరునవ్వుతో మానసిక రుగ్మతలు దూరమవుతాయని శాస్త్రీయంగా రుజువైంది. మానవ సంబంధాలు పెంపొందుతాయి. మనిషి మానసిక స్థితిని ఆహ్లాదకరంగా ఉంచుతుంది. అంతటి ఆరోగ్యాన్ని పెంపొందించే చిరునవ్వుకు ఓ రోజుంది..

అక్టోబరు 4న 'స్మైల్ డే' నిర్వహిస్తుంటారు.

మీకు తెలుసా?



అమెరికాకు చెందిన ప్రముఖ చిత్రకారుడు హార్వే రాస్ బాల్ తొలిసారిగా స్మైలీ ఫేస్(నవ్వించే ముఖం) చిత్రాన్ని గీశారు.

అనేక ప్రశ్నలకు సమాధానం..


కొన్ని సందర్భాల్లో మన చిరునవ్వు అనేక ప్రశ్నలకు జవాబవుతుంది. ఇతరుల బాధను మాయం చేస్తుంది. ద్వేషించే వారిని దగ్గరకు చేర్చుతుంది. పిల్లలు తమ తల్లిదండ్రులను, పెద్దలను నవ్వుతో పలకరించాలి. పెద్దలు కూడా పిల్లలకు చిరునవ్వుతో పనులు చెప్పాలి. అప్పుడే ఆ ఇల్లు ఆనందమయ కోవెలగా మారుతుంది. చిరునవ్వుతో బయటకు వెళ్తే రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. అందుకే జనాలను నవ్వించేందుకు లాఫింగ్ క్లబ్‌లు, హాస్యభరిత చిత్రాలు, కామెడీ సినిమాలు, రియాలిటీ షోలు అందుబాటులో ఉంటున్నాయి.

సచిన్‌తో సచిన్..



ఒకరేమో మరాఠీ దిగ్గజ నటుడు సచిన్ పిల్గావకర్. మరొకరేమో క్రికెట్ దేవుడు సచిన్. ఓ పురస్కార ప్రదానోత్సవ వేదికపై ఇద్దరు కలుసుకున్నారు. ఊహ తెలిసినప్పటి నుంచి మిమ్మల్ని చూస్తున్నా. అప్పటికీ, ఇప్పటికీ మీ ముఖం చిరునవ్వుతోనే కళకళలాడుతుందని టెండూల్కర్ అనడంతో వెంటనే మైక్ లాక్కొని మీరు కూడా చిరునవ్వుతోనే క్రికెట్ రంగంలో రికార్డులు నెలకొల్పారని పిల్గావకర్ చిరునవ్వుతోనే సమాధానమిచ్చారు. ఈ దృశ్యం వీక్షకులను సైతం ఆకట్టుకుంది.

ఆరోగ్యానికి మేలు



చిరునవ్వు అనేది మనిషి మానసిక స్థితిని తెలియజేస్తుంది. చిరునవ్వు అలవాటు ఉన్నవారి శరీరంలో నాడీ మండలాలు ఉత్తేజితమవుతాయి. రక్త ప్రసరణ సాఫీగా జరుగుతుంది. నిద్రలేమి, ఒత్తిడి, అలసట, గ్యాస్ట్రిక్, హైపర్‌టెన్షన్, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మైగ్రెన్, కండరాల నొప్పుల నుంచి కోలుకోవచ్చు. సకరాత్మక హార్మోన్లు ఎండోర్ఫిన్, సెరటోనిన్ విడుదలై మానసికోల్లాస అనుభూతిని పొందుతారు. గుండె దడ నియంత్రణలో ఉంటుంది. రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. - డా.ఓంప్రకాశ్, మానసిక వైద్య నిపుణులు

పరుగుల వర్షం కురిపించి..



భారత క్రికెటర్ అజయ్ జడేజాను ఎప్పుడు చూసినా చిరునవ్వుతోనే కనిపిస్తుంటారు. 1996లో జరిగిన ప్రపంచ క్రికెట్ కప్ క్వార్టర్ ఫైనల్‌లో పాకిస్థాన్ బౌలర్లు వకార్ యూనుస్, అకిబ్ జావేద్, అతా-ఉర్-రెహ్మాన్ అజయ్ జడేజాను రెచ్చగొట్టారు. భయపెట్టేలా బాడీలెంగ్త్ బౌలింగ్ వేశారు. ఆయన ఏకాగ్రతను భంగం చేసేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అయినా జడేజా వారి కుయుక్తులకు లొంగకుండా చిరునవ్వుతోనే బ్యాట్‌తో పరుగుల వర్షం కురిపించారు. భారత్ భారీ స్కోరులో కీలక పాత్ర పోషించారు.

లాఫింగ్ క్లబ్..



మధుసింఘాల్ ఆదిలాబాద్‌లో మహిళల కోసం లాఫింగ్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ద్వారకానగర్ కాలనీలోని మున్సిపల్ పార్కులో రోజూ ఉదయం గంట పాటు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. 50 మందికిపైగా మహిళలు ఈ క్లబ్‌లో చేరి యోగాభ్యాసం చేస్తున్నారు. ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే ఇంట్లో అందరు బాగుంటారని నిర్వాహకురాలు చెబుతున్నారు.

ఉర్దూ నేర్చి.. ఉద్యోగం సాధించి!

● గిరిజన యువతి ఘనత



పవార్ మౌనిక

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఇంటి చుట్టూ ఉన్న ముస్లింలతో ఉర్దూ భాషలో మాట్లాడటం అలవాటు చేసుకున్న ఆ యువతికి ఆ భాషే చివరకు ఉద్యోగాన్ని సాధించిపెట్టింది. ఉట్నూరు మండలం లక్కారం మసీదు ఏరియాలో నివాసముండే న్యాయవాది పవార్ వసంత్‌రావు కూతురు పవార్ మౌనిక డీఎస్సీ ఉర్దూ మాధ్యమంలో ఎస్జీటీగా ఎంపికయ్యారు. ఎస్టీ విభాగంలో రెండు పోస్టులు రిజర్వు చేయడంతో ఆమెకు ఉద్యోగం దక్కడం లాంఛనమే. గురువారం డైట్ కళాశాలలో జరిగిన ధ్రువపత్రాల పరిశీలనకు ఆ యువతి హాజరైంది. ఇంటర్‌లో ద్వితీయ భాషగా ఉర్దూను ఎంచుకుంది. ఉర్దూ భాషను మిత్రులతో పాటు యూట్యూబ్ సాయంతో నేర్చుకున్నట్లు మౌనిక తెలిపారు. బీఏ లిటరేచర్ ఉర్దూలో చేస్తున్నట్లు వివరించారు. ప్రతిసారి ఉర్దూ మాధ్యమంలో రిజర్వేషన్ కేటగిరి పోస్టులు అభ్యర్థులు లేక మిగిలిపోతున్నాయి. ఈ విషయం తెలిసిన వసంత్‌రావు తన కూతురు మౌనికను ఉర్దూ భాష లిపిని నేర్చుకోవాలని ప్రోత్సహించారు. ఫలితంగా ఆ యువతి ఉద్యోగం సాధించగలిగింది. ఎంపికైన మరో అభ్యర్థి రాఠోడ్ ఆర్థిక స్వయాన మౌనికకు చిన్నమ్మ కావడం మరో విశేషం. వీరిద్దరూ ఉర్దూ మాధ్యమంలో పాఠాలు బోధించనున్న తొలి గిరిజన తెగ అభ్యర్థులుగా చరిత్ర సృష్టించనున్నారు.

ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిపై ఆరోపణల కలకలం

ముథోల్(బాసర), న్యూస్‌టుడే : బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిపై పలు ఆరోపణలతో కూడిన కరపత్రం గురువారం ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ పేరిట విడుదలవడం కలకలం సృష్టించింది. ఆ కరపత్రం పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్‌తోపాటు ఆర్జీయూకేటీ ఉపకులపతిగా కొనసాగుతూ, పేద విద్యార్థులకు చెందాల్సిన డబ్బులు కాజేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాడని ఆరోపించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులను నియమించుకొని, ట్రిపుల్ ఐటీ ఉద్యోగులుగా రూ.లక్షల జీతం ఇస్తూ అక్రమాలకు తెరలేపారన్నారు. ఆర్జీయూకేటీలో విద్యార్థులు, మహిళా ఉద్యోగులను వేధించడం, అప్పుడప్పుడూ ఇక్కడికి వస్తూ విశ్వవిద్యాలయానికి సంబంధించిన డబ్బులు దండుకున్నాడన్నారు. చేయని పనులకు నకిలీ బిల్లులు సృష్టించి, భోజనశాలల నిర్వాహకుల వద్ద డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' ఆర్జీయూకేటీ ఉపకులపతిని చరవాణిలో సంప్రదించగా తాను దీనిపై ఏమి మాట్లాడనని తెలిపారు.

శైలపుత్రి నమోస్తుతే..




శైలపుత్రిగా దర్శనమిస్తున్న అమ్మవారు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవగా గురువారం బాసర అమ్మవారు శైలపుత్రి అవతారంలో దర్శనమిచ్చారు. అంతకుముందు అమ్మవారికి అభిషేకం, వ్యాసమహర్షికి పూజలు చేసి ఘటస్థాపనకు అవసరమైన నీటిని తీసుకెళ్లారు. అనంతరం ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో ఘటస్థాపన పూజలో ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆలయ ఈఓ విజయరామారావు, ఆలయ ఛైర్మన్ శరత్‌పాఠక్ పాల్గొన్నారు. నవరాత్రులు ప్రారంభం కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనం, అక్షరాభ్యాసాలు చేయించారు. బాసర మాజీ సర్పంచి దయాల లక్ష్మణ్‌రావు తులం బంగారంతో అమ్మవారికి తయారు చేయించిన ముక్కు పుడకను ఆలయ ఈఓకు అందజేశారు.



ఘట స్థాపన చేస్తున్న ఆలయ వేద పండితులు, ఈఓ విజయరామారావు



ఆలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రదర్శనలో అష్టాదశ శక్తి పీఠాల విగ్రహాలు

బెల్లంపల్లిలో అష్టాదశ శక్తి పీఠాలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : వివిధ రాష్ట్రాల్లో వెలసిన అష్టాదశ శక్తి పీఠాలను దర్శించుకోవాలంటే వ్యయప్రయాసలతో కూడుకున్నది. ఇది అందరికీ సాధ్యం కాదు. శక్తి పీఠాలను దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుందనేది భక్తుల విశ్వాసం. అలాంటి శక్తి పీఠాలను బెల్లంపల్లి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. అమ్మవార్ల శక్తి పీఠాల విగ్రహాల వద్ద మిరుమిట్లు గొలిపేలా లైటింగ్ ఏర్పాటు చేయడంతో వాటి స్వరూపం అచ్చంగా అక్కడికి వెళ్లి దర్శించుకున్న అనుభూతి కలుగుతుంది. దుర్గాదేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన శక్తి పీఠాల ప్రదర్శన ఆకట్టుకుంటుంది.

నిషేధిత మత్తుపదార్థం స్వాధీనం

● సరకు విలువ రూ.43 లక్షలు



పట్టుకున్న ఆల్ఫాజోలం, క్లోరల్‌హైడ్రేట్ సంచులతో ఆబ్కారీ అధికారులు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ గోదాంలో నిల్వ చేసిన కల్తీ కల్లు తయారీకి వినియోగించే మత్తు పదార్థాన్ని(క్లోరల్ హైడ్రేట్) ఆబ్కారీశాఖ రాష్ట్ర బృందం ఆధ్వర్యంలో గురువారం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 728 కిలోల సీహెచ్‌ను ఇక్కడ నిల్వ ఉంచారు. ఆబ్కారీశాఖ ఉన్నతాధికారులకు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో గురువారం సోదాలు చేపట్టగా ఈ విషయం బయటపడింది. స్థానిక ద్వారకానగర్‌లో ఉండే శ్రీనివాస్‌గౌడ్ అనే వ్యక్తి ఇంట్లో ఆల్ఫాజోలం నిల్వ చేశాడనే పక్కా సమాచారంతో అధికారులు తనిఖీ చేపట్టారు. అతడి వద్ద 3.3 కిలోల ఆల్ఫాజోలం లభించింది. లోతుగా విచారించగా శాంతినగర్‌లోని ఓ గోదాంలో సీహెచ్ నిల్వ చేసినట్లు అంగీకరించాడు. అక్కడికి చేరుకున్న అధికారులు సీహెచ్ బస్తాలను స్వాధీనం చేసుకొని కార్యాలయానికి తరలించారు. ఈ మొత్తం విలువ రూ.43 లక్షలు ఉంటుందని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృంద పర్యవేక్షకుడు ప్రదీప్‌రావు తెలిపారు. నిందితుడిపై గతంలోనూ పలు కేసులు, పీడీ యాక్ట్ నమోదైనట్లు ఆయన వివరించారు. తాజా ఘటనలో అతడిపై మరో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్ నుంచి ఇది సరఫరా అవుతున్నట్లు గుర్తించామని, అసలు సూత్రధారులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు.

ఆటల్లో మేటి.. సత్తా చాటి

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే:

ఏడాదిలో చివరి నాలుగు నెలలు క్రీడా మాసంగా చెప్పొచ్చు. ఎస్‌జీఎఫ్‌తో పాటు వివిధ క్రీడా అసోసియేషన్లు ఈ రోజుల్లోనే పోటీల నిర్వహణ చేస్తుంటారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ ఇలా అన్ని స్థాయిల్లో ఈ 120 రోజుల్లోనే జరుగుతుంటాయి. ప్రతిభ ఉన్న క్రీడాకారులు బయటికొచ్చేదీ.. వారి భవిష్యత్తును బంగారు బాటవేసుకునే అవకాశం ఇప్పుడే కావడం విశేషం. ఈ సంవత్సరం గత రెండు నెలలుగా ఎస్‌జీఎఫ్, అసోసియేషన్లు జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి పోటీలు పోటాపోటీగా నిర్వహిస్తోంది. ఆయా విభాగాల్లోని క్రీడాకారులు మెరుగైన ఆటతీరును కనబరుస్తున్నారు. రాష్ట్ర, జాతీయ పోటీలకు అర్హత పొందుతున్నారు. ఇటీవల జరిగిన పలు పోటీల్లో సత్తా చాటి.. ఉన్నతస్థాయికి చేరుకున్న పలువురిపై 'న్యూస్‌టుడే' కథనం.



ఇటీవల రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు

రాకెట్‌తో.. ర్యాంకులకు పోటీ



మంచిర్యాల జిల్లాకు చెందిన అనన్య.. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. బ్యాడ్మింటన్‌పై ఆసక్తితో కొంతకాలం జిల్లా కేంద్రంలోనే శిక్షణ పొందగా ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ శిక్షణ కేంద్రంలో సాధన చేస్తోంది. రాకెట్‌తో మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. పాఠశాల క్రీడా సమాఖ్య తరపున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ఆటతీరుతో ఆకట్టుకుంది. అండర్-15 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయిలో 8, జాతీయస్థాయిలో 30వ ర్యాంకులో కొనసాగుతోంది. ప్రస్తుతం విజయవాడలో జరుగుతున్న ఆలిండియా ర్యాంకింగ్ పోటీల్లో మరింత మెరుగైన స్థానం కోసం పోటీపడుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో పీఎస్పీ మెట్‌లైఫ్ జేబీసీ రాష్ట్రస్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపికైంది.

హ్యాండ్‌బాల్‌లో జాతీయస్థాయికి



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల(సిర్పూర్-టి) పదో తరగతి విద్యార్థి దుర్గం యోగి హ్యాండ్‌బాల్‌లో సత్తాచాటుతున్నాడు. జట్టులో నాలుగో సభ్యుడిగా మెరుగైన ప్రదర్శన ఇస్తూ ఆకట్టుకున్నాడు. ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ఆటతీరును కనబరిచాడు. ఉమ్మడి జిల్లా జట్టు మొదటిస్థానం కైవసం చేసుకోవడంలో తనవంతు బాధ్యతను నిర్వర్తించాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఇప్పటికే నాలుగుసార్లు ఎంపిక కాగా తొలిసారి జాతీయస్థాయిలో చోటు సాధించాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న పోటీల్లో తన ప్రతిభను పరీక్షించుకుంటున్నాడు.

మొదటిసారి.. మెరుగైన స్థాయి

కౌటాల మండలానికి చెందిన కార్తీక్.. మొదటిసారి రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. హ్యాండ్‌బాల్ జట్టులో మూడో సభ్యుడిగా సత్తాచాటేందుకు సిద్ధంగా ఉన్నాడు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో అభ్యసిస్తున్న కార్తీక్ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కీలకపాత్ర పోషించాడు. అసోసియేషన్, ఎస్‌జీఎఫ్ ఏర్పాటు చేసిన పలు పోటీల్లో ప్రతిభ చాటాడు. రాష్ట్రస్థాయి ధ్రువీకరణపత్రాలు సొంతం చేసుకున్నాడు. జాతీయస్థాయికి చేరి అదే ఆటతీరుతో మరింత ఉన్నతస్థానానికి చేరుకునేందుకు సిద్ధంగా ఉన్నాడు.



యోగా.. చేస్తాడు బాగా

మంచిర్యాల జిల్లా బొక్కలగుట్టకు చెందిన రాహుల్.. యోగాసనాల్లో దిట్ట. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. యోగాపై మక్కువతో ఆరేళ్లుగా సాధన చేస్తున్నాడు. ఒళ్లును విల్లులా చేస్తూ ఔరా అనిపిస్తున్నాడు. జిల్లా పోటీల్లో సాధించిన పతకాలకు లెక్కే లేకపోగా రాష్ట్రస్థాయిలోనూ అదేతీరును కనబరుస్తున్నాడు. రెండుసార్లు పసిడి పతకాలు కైవసం చేసుకున్నాడు. జాతీయ పోటీల్లోనూ కాంస్య పతకాన్ని తన ఖాతాలో వేసుకోగా ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆసనాలతో ఆకట్టుకుని నాలుగోసారి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు సన్నద్ధమవుతున్నాడు.



ఆసనాలతో ఔరా అనిపించేలా..



హైదరాబాద్‌లో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న మంచిర్యాల జిల్లాకు చెందిన వైష్ణవి యోగాలో ప్రతిభచాటుతోంది. గత నాలుగేళ్లుగా శిక్షణ తీసుకుంటుండగా మొదటిసారి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకుని కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. గతంలో ఒకసారి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. జాతీయస్థాయికి తొలిసారి చేరగా ఆసనాలతో ఆకట్టుకుని పతకం సాధించేందుకు సిద్ధమవుతోంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, సిరికొండ

? సిరికొండ మండలం జెండాగూడ వెళ్లే మార్గంలో రోడ్డు అధ్వానంగా మారింది. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి.
- సోనికుడు, జెండాగూడ

✔ రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేయించి ఇబ్బందులు తీరుస్తాం.
- రాజేష్, పీఆర్ డీఈ

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

? ఆదిలాబాద్ పట్టణంలోని కొత్తహౌసింగ్‌బోర్డు కాలనీ జోన్-1లో వీధి దీపాలు వెలగడం లేదు. బతుకమ్మ, నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు.
- మనోజ్‌రెడ్డి, స్థానికుడు

✔ బల్దియా సిబ్బందిని పంపించి వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- తిరుపతి, డీఈఈ**

రిమ్స్‌లో నవజాత శిశువు మృతి

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : రిమ్స్ ఎస్ఎన్‌సీయూలో నవజాత శిశువు గురువారం మృతి చెందింది. మధ్యాహ్నం ఆలినాకు శస్త్ర చికిత్స ద్వారా జన్మించిన శిశువుకు శ్వాస సంబంధ ఇబ్బంది ఉండటంతో ఎస్ఎన్‌సీకి తరలించారు. ఈ శిశువుకు శ్వాస సంబంధిత ఇబ్బంది ఉందని 24 గంటలు గడిస్తే గానీ ఏమీ చెప్పలేమని వైద్యులు కుటుంబ సభ్యులకు సూచించారు. రాత్రి 8 గంటలకు శిశువు మృతి చెందిందని వైద్యులు తెలిపారు. వైద్యులు సకాలంలో రెఫర్ చేయకపోవడంతో మృతి చెందిందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: మావల పోలీసు స్టేషన్ పరిధిలో దిలుకూరి గార్డెన్ వద్ద దాదాపు 55 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. అనంతరం మృతదేహాన్ని రిమ్స్ శవాగారానికి తరలించి భద్రపరిచారు. కొన్ని రోజులుగా అతడు భిక్షాటన చేస్తూ జీవించేవాడని మావల ఎస్ఐ విష్ణువర్ధన్ పేర్కొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

జన్నారం, న్యూస్‌టుడే : జన్నారం మండలం దేవునిగూడలో ఓ మహిళ మెడలో నుంచి రెండు తులాల పుస్తెలతాడును గురువారం గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనం మీద వచ్చి లాక్కెళ్లాడు. ఆదిలాబాద్ జిల్లా దంతన్‌పల్లి గ్రామానికి చెందిన చింతకింది రమా దేవునిగూడలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. సీసీ ఫుటేజీలను పరిశీలించామని నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని జన్నారం ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.

వృద్ధులు నిరాదరణకు గురైతే ఫిర్యాదు చేయొచ్చు

ఎదులాపురం, న్యూస్‌టుడే: వృద్ధులు నిరాదరణకు గురైతే న్యాయ సేవాధికార సంస్థకు ఫిర్యాదు చేయొచ్చని డీఎల్ఎస్ఏ కార్యదర్శి బొనగిరి సౌజన్య సూచించారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో గురువారం డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వారి హక్కులు, చట్టాల గురించి వివరించారు. న్యాయ సహాయం ఉచితంగా పొందవచ్చన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సీనియర్ సిటిజన్స్ సంఘం అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే, న్యాయవాది అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి బొనగిరి సౌజన్య

బీమాతోనే కుటుంబానికి ధీమా

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ తపాలా కార్యాలయం ద్వారా అందజేస్తున్న జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ సబ్ డివిజన్ పోస్టల్ అధికారి సందీప్ అన్నారు. గురువారం తోషం పంచాయతీలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సరికుండ ప్రమాద బీమా పథకం కింద ఆమోదం చేసిన రూ.54 వేల చెక్కును అందజేశారు. ఐపీపీబీ జిల్లా మేనేజర్ రాజేష్, తోషం బీపీఎం కాళావతి తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన దుర్గమ్మ


మన్నూర్ : శోభాయాత్రలో భక్తులు


అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దంపతులు


బజార్‌హత్నూర్‌లో

బోథ్, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, తలమడుగు, ఇచ్చోడ(నేరడిగొండ), తాంసి, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా గురువారం దుర్గాదేవి ప్రతిమలు మండపాల్లో కొలువుదీరాయి. గ్రామాలలో దుర్గా మండపాలను కమిటీ సభ్యులు అందంగా అలంకరించారు. విగ్రహాలను ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు అమ్మవారి దీక్షను చేపట్టారు.


బోథ్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు


తలమడుగులో...

తేలని ముహూర్తం!

★ తేమ నిర్ధారణ, నగదు బదిలీపై చర్చ


మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : పత్తి కొనుగోళ్ల ముహూర్తం ఎప్పుడో ఇంకా తేలలేదు. బహిరంగ మార్కెట్‌లో ధర పడిపోయినందున వ్యాపారులు పత్తి కొనుగోళ్లు చేయమని తేల్చిచెప్పారు. ఇక మద్దతు ధర దక్కాలంటే అన్నదాతలకు సీసీఐ పెద్ద దిక్కుగా మారనుంది. ఈ విషయాలు గురువారం కలెక్టరేట్‌లో జరిగిన పత్తి కొనుగోళ్ల సన్నద్ధత సమావేశంలో బహిర్గతమయ్యాయి. పాలనాధికారి రాజర్షిషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్‌జాదవ్, వెడ్మ బొజ్జు, ఎస్పీ గౌష్‌ఆలం, అదనపు పాలనాధికారి శ్యామలదేవి, రైతు ప్రతినిధులు, మార్కెటింగ్, వ్యవసాయ, సీసీఐ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత రైతు ప్రతినిధులు గతంలో కాంటాల్లో వ్యత్యాసాలు, తేమ నిర్ధారణలో ఇబ్బందులు, నగదు బదిలీలో తలెత్తిన సమస్యలను ప్రస్తావించారు. వ్యాపారులు విద్యుత్తు సమస్యను లేవనెత్తారు. అనంతరం పాలనాధికారి మాట్లాడుతూ జిల్లాలో పత్తిని క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.7521కు సీసీఐ కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఆదిలాబాద్, సొనాల, నేరడిగొండ, ఇంద్రవెల్లి, నార్నూర్, ఇచ్చోడ, జైనథ్, బేల యార్డుల్లో కొనుగోళ్లు జరుగుతాయని పేర్కొన్నారు. తేమ నిబంధనలు సడలించాలని బోథ్ ఎమ్మెల్యే ప్రభుత్వానికి నివేదించాలని సూచించగా.. ప్రస్తుతం 8-12శాతం లోపు తేమ ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని పాలనాధికారి కోరారు. టెండరు ప్రక్రియ, ఆన్‌లైన్ పంట వివరాల బదలాయింపు జరగనందున కొనుగోళ్ల తేదీని నిర్ణయించలేకపోతున్నట్లు పేర్కొన్నారు. మరోమారు సీసీఐ అధికారులతో సమావేశమై ఖరారు చేస్తామన్నారు. రైతులను మోసం చేస్తే సహించబోమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం భోజనం సదుపాయం కల్పించాలని లేకుంటే పాయల్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాట్లు చేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు.


మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, చిత్రంలో ఆదిలాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి

జైనథ్, న్యూస్‌టుడే : ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జైనథ్ జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ. 13.50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న అదనపు తరగతి గది నిర్మాణానికి గురువారం నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. పాఠశాలలో నిర్మాణంలో ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంకర్‌ను ప్రధానోపాధ్యాయుడు మద్ది లస్మన్న కోరగా.. కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానన్నారు. ఉపాధ్యాయులు రవీందర్, దయానంద్‌రెడ్డి, దేవన్న, నాయకులు విజయ్, కె.రాందాస్, ఎస్.రమేష్ రెడ్డి, టి.రాకేష్‌రెడ్డి, ప్రతాప్‌యాదవ్, పెద లస్మన్న, అశోక్‌రెడ్డి, సుభాష్, జి.సత్యనారాయణ, చిన్నన్న, వై. రాకేష్‌రెడ్డి, రాకేష్, రమేష్, అశోక్, ముకుంద్ రావు, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం యువకుడి పెద్ద మనసు


పూజలు చేస్తున్న మహమ్మద్ అలీం బేగ్

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : బోథ్ మండలం సొనాల గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు మహమ్మద్ అలీం బేగ్ దుర్గామాత విగ్రహాన్ని తన సొంత నగదుతో కొనుగోలు చేశాడు. గురువారం గ్రామంలో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. గ్రామంలో మతాలకు అతీతంగా ఒకరి మతాలను ఒకరు గౌరవించుకుంటూ ముందుకు సాగుదామని యువకుడు, గ్రామ పెద్దలు పేర్కొన్నారు. సదరు యువకుడిని గ్రామ పెద్దలు సన్మానించారు. నడ్పి బాపు, వసంత్‌రావు, సదానందం, బాశెట్టి రమేష్, హరీశ్, భూమారెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

40 ఏళ్ల రేషన్ కష్టాలు దూరం

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : అడవి దారిలో 40 ఏళ్లుగా కష్టాలు అనుభవిస్తూ రేషన్ బియ్యం తెచ్చుకుంటున్న ఆదివాసీల కష్టాలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తీర్చారు. వడ్‌గాం రేషన్ దుకాణం నుంచి వాల్గొండ, గోపాల్‌పూర్, మారుతిగూడ, హీరాపూర్, లాల్‌టేకిడి గ్రామాల ప్రజలు బియ్యం తెచ్చుకునేవారు. సమస్యను ఎన్నికల వేళ వెడ్మ బొజ్జు దృష్టికి తీసుకొచ్చారు. ఇంద్రవెల్లి మండలంలో నూతనంగా అంజి, వాల్గొండ, హీరాపూర్, పిట్టబొంగరం, భీంజి తండా, సమాక, తుమ్మగూడ, పిప్రి గ్రామాలకు కొత్త రేషన్ దుకాణాలను మంజూరు చేయించారు. గురువారం రేషన్ దుకాణాలను ప్రారంభించారు.

కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : రాష్ట్ర మంత్రి కొండా సురేఖను సామాజిక మాధ్యమాల్లో కించపర్చేలా పోస్టులు పెట్టి అవమానించారని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ ఆరోపించారు. పార్టీ రాష్ట్ర అధిష్టానం పిలుపు మేరకు గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీని దహనం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళా నేతలు సోనియా, షబానా, జుబేదా, ఖమర్ బేగం, అఫ్రోజా, జైనథ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అశోక్‌రెడ్డి, గుడిపెల్లి నగేష్, కలాల శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, సంతోష్, రాజేశ్వర్, ఏవాన్, కిషన్, ఖయ్యుం పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : కల్యాణలక్ష్మి పథకం పొందేందుకు దళారులను నమ్మి మోసపోవద్దని, ఎవరైనా డబ్బులు అడిగితే చెప్పాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. గురువారం జడ్పీ సమావేశమందిరంలో 182 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. డీసీసీబీ ఛైర్మన్ భోజారెడ్డి, అర్బన్ తహసీల్దారు శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్లు, ఆయాపార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ(నేరడిగొండ): నేరడిగొండలో కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ తులం బంగారం కూడా అందజేసి ఆదుకోవాలని కోరారు.


గుడిహత్నూర్‌లో సభ్యత్వ నమోదు చేపడుతున్న ఎంపీ నగేష్

భాజపా సభ్యత్వ నమోదు

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పాలనలో పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయం జరుగుతోందని ఎంపీ గోడం నగేష్ అన్నారు. గురువారం గుడిహత్నూర్ మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చి పేదలతో ఒకలా ధనికులతో మరోలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మణ్, మండల పార్టీ అధ్యక్షుడు శివాజీ, నాయకులు వామన్ పటేల్, శైలందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోం

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్న తీరును చూసి ఓర్వలేక కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారం చేస్తున్న కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ నేతలతో కలిసి ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో సీఐ మొగిలిని కలిసి కేటీఆర్‌పై ఫిర్యాదు చేశారు. రాజవ్వ, కౌసల్య, నీలాబాయి, అన్నపూర్ణ, మల్లు, కవిత, సరిత, వరలక్ష్మి, స్వప్న, విజయలక్ష్మి, గౌరుబాయి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మరో డీఎస్సీ ప్రకటన

పాలనాధికారి వెల్లడి

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : తాజాగా చేపట్టబోతున్న డీఎస్సీ నియామకాలతో జిల్లాలో కొంతవరకు ఉపాధ్యాయుల కొరత తీరనుందని, అదే సందర్భంలో ప్రభుత్వం మరో డీఎస్సీ ప్రకటనకు చర్యలు తీసుకుంటోందని పాలనాధికారి రాజర్షిషా వెల్లడించారు. గురువారం డైట్ కళాశాలలో కొనసాగుతున్న డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనను పర్యవేక్షించారు. కౌంటర్లు తిరిగి సర్టిఫికెట్ల పరిశీలన తీరును గమనించారు. బ్యాక్‌లాగ్‌గా మిగిలిపోతున్న ఉర్దూ పోస్టులను డి రిజర్వు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 9న ఎల్బీ స్టేడియంలో అభ్యర్థులకు నియామకపత్రాలను అందించనున్నారని గుర్తు చేశారు. గురువారం 225 మంది అభ్యర్థులు పరిశీలనకు హాజరైనట్లు డీఈవో ప్రణీత తెలిపారు. రెండు రోజుల్లో ఆ సంఖ్య 333 మందికి చేరినట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఎస్సీ నియామకాల ప్రక్రియపై సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయం నుంచి జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు. పాలనాధికారితో పాటు ఎస్పీ గౌష్‌ఆలం, అదనపు పాలనాధికారి శ్యామలదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో గ్రామాల అభివృద్ధి

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : ఆధ్యాత్మికతతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీ గోడం నగేష్ అన్నారు. దసరా నవరాత్రులలో భాగంగా బోథ్ మండలం సొనాలలోని రామాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.వి.రమణ, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడా పోటీలు

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : యాపల్‌గూడ 2వ పోలీసు బెటాలియన్ వార్షిక క్రీడా పోటీలను గురువారం కమాండెంట్ నితికా పంత్ ప్రారంభించారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. క్రీడాకారులు క్రమశిక్షణ, ఐక్యతను చాటుతూ కవాతును నిర్వహించారు. క్రీడలు ఉల్లాసాన్ని, స్నేహాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అదనపు కమాండెంట్, రిజర్వ్ సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

'ఈనాడు' చొరవ.. ఆకలి తీర్చింది!


అభ్యర్థులకు భోజనం వడ్డిస్తున్న డీఈవో ప్రణీత

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ డైట్ కళాశాలలో గురువారం జరిగిన ధ్రువపత్రాల పరిశీలనకు డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. తల్లిదండ్రులతో కొందరు.. పిల్లలతో మరికొందరు రావడంతో రద్దీ నెలకొంది. బయటకు వెళ్తే మరింత ఆలస్యమవుతుందని మధ్యాహ్నం ఖాళీ కడుపుతో నిరీక్షించారు. ఈ విషయాన్ని 'ఈనాడు' బృందం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్ దృష్టికి తీసుకురాగా.. సంఘం తరపున 300 మందికి భోజనం పెట్టించారు. డీఈవో ప్రణీత స్వయంగా వడ్డించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విషయం తెలుసుకున్న పాలనాధికారి రాజర్షిషా సైతం పీఆర్‌టీయూ చొరవను ప్రశంసించారు. శుక్రవారం కూడా ఈ కార్యక్రమం కొనసాగిస్తామని జిల్లా అధ్యక్షులు పేర్కొన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.నరసింహస్వామి, గౌరవ అధ్యక్షులు గోవర్ధన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వినోద్‌రెడ్డి, జిల్లా, మండలాల బాధ్యులు రాంరెడ్డి, సాగర్, సులోచనరాణి, కృష్ణవేణి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సర్వే పకడ్బందీగా చేపట్టండి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం ప్రారంభించిన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ వినోద్‌కుమార్, బల్దియా కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ అన్నారు. గురువారం 11వ వార్డులో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. ఇంట్లో కుమారులకు పెళ్లి అయితే కోడళ్ల వివరాల మార్పులు చేర్పులు, కుటుంబం వేరుపడితే విడిగా వారి పేర్లను నమోదు చేయాలని సూచించారు. వార్డులో సర్వే పూర్తి చేసేందుకు అయిదు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కౌన్సిలర్ షానవాజుర్ రెహ్మాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు భూమన్న ఉన్నారు.


రాంనగర్‌లో సర్వేను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ వినోద్‌కుమార్, పుర కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

తలమడుగు: గ్రంథాలయాలు విద్యార్థుల భవిష్యత్తు విజ్ఞానానికి నిలయాలని జడ్పీటీసీ మాజీ సభ్యులు గణేష్‌రెడ్డి, బాబన్నలు అన్నారు. బరంపూర్‌లో గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలు, ఇతర సౌకర్యాలను సొంత డబ్బులతో వారంలో అందిస్తామని భరోసానిచ్చారు. డీఎస్సీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నిఖిల్‌ను సత్కరించారు. ప్రతాప్, నర్సయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆశన్న, పోతారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పోశెట్టి, నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఉట్నూరు, న్యూస్‌టుడే : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇంద్రవెల్లి మండలం భాజపా, భారాస మాజీ సర్పంచులు సుంకట్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ గోపాల్‌సింగ్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మండల మాజీ అధ్యక్షుడు జుగ్నాక భారత్‌తో పాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు, పటేళ్లు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

ఆసుపత్రిలో వైద్యుడి హత్య అమానుషం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : దేశ రాజధానిలోని బుధవారం వైద్యుడిని హత్య చేయడం అమానుషమని ఆదిలాబాద్ రిమ్స్ జూడాల అసోసియేషన్ పేర్కొంది. ఇప్పటికే కోల్‌కతాలో వైద్యురాలిని హత్యాచారం చేసిన ఘటన మరువక ముందే దిల్లీలో వైద్యుడిని హత్య చేసిన ఘటనను తమ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని సంఘం కార్యదర్శి డాక్టర్ కారుణ్య పేర్కొన్నారు.

తొలి విడత ఎంబీబీఎస్ ప్రవేశాలు పూర్తి

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ రిమ్స్ వైద్య కళాశాలలో ఈ ఏడాది ఎంబీబీఎస్ మొదటి విడత రాష్ట్ర కోటా ప్రవేశాలు గురువారంతో పూర్తయ్యాయి. ఇది వరకు ఆల్ ఇండియా కోటాలో 15 సీట్లు కేటాయించగా మొదటి విడతలో ఇద్దరు, రెండో విడతలో 11 మంది ప్రవేశాలు పొందారు. మరో రెండు సీట్లు భర్తీ కావాల్సి ఉంది. రాష్ట్ర కోటా మొదటి విడతలో 75 సీట్లు కేటాయించగా అన్నీ భర్తీ అయ్యాయి. రిమ్స్ సంచాలకుడు రాథోడ్ జైసింగ్ తన సిబ్బందితో కలిసి విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తూ ప్రవేశాలను కల్పించారు. రెండో, మూడో విడత, మాప్‌అప్ రౌండ్లలో మరో 30 సీట్లు భర్తీ కావాల్సి ఉంది.